# మళ్ళీ ఆ గూటికే



**ధూర్తులు అమాయక ప్రజల జీవితాలను ఎలా శాసిస్తారో ముంగర శంకరరాజు కథలు పాఠకులకు చాటి చెప్తాయి.**

వెంకటపతి, శ్రీనివాస్ హోటల్లో కలుసుకున్నారు. మిత్రులిద్దరూ కాఫీ తాగారు. పిచ్చాపాటీ మాట్లాడుకున్నారు. "ఒక వార్త సేకరించడానికి పోలీసు స్టేషన్ పోతున్నా నువ్వూ రాకూడదూ నాతో" అన్నాడు శ్రీనివాస్.

"దేనికి సంబంధించిన వార్త?" అడిగాడు వెంకటపతి.

"మన జిల్లాకు చెందిన నలుగురు అమ్మాయిలు బొంబాయి రెడ్‌లైట్ ఏరియా వ్యభిచార గృహాల్లో బందీలుగా ఉంటే మన పోలీసువాళ్ళు వెళ్ళి విడిపించుకొని తెచ్చారంట. వెళ్ళి విచారిద్దాం రా" అన్నాడు. వెంకటపతికి ఆడవాళ్ళ సంగతులు ఎప్పుడూ ఆసక్తికరంగానే ఉంటాయి. "సరే పద" అన్నాడు ఉత్సాహంతో.

శ్రీనివాస్ ఒక ప్రముఖ వార్తాపత్రికకు విలేఖరిగా పనిచేస్తున్నాడు. వెంకటపతి మున్సిపల్ కౌన్సిలర్, కాంట్రాక్టర్. అదేగాక స్థానికంగా వెలువడే ఓ చిన్న వారపత్రికకు యజమాని కూడా.

ఒన్ టౌన్ పోలీస్‌స్టేషన్ మామూలు కంటె కొంచెం ఎక్కువ సందడిగా ఉంది. బయట మనుషులు గుంపులు గుంపులుగా చేరి కాంపౌండు గోడ మీదుగా తొంగి తొంగి వినోదం చూస్తున్నారు. ఇద్దరు పోలీసులు జనాన్ని అదిలిస్తున్నారు.

స్టేషన్ ముందు భాగం ఆవరణలో వేపచెట్టు కింద బండ అరుగు మీద నలుగురు అమ్మాయిలు కూచొని ఉన్నారు. అందరూ పద్దెనిమిది, ఇరవై అయిదు మధ్య వయసులో ఉన్న యువతులు. తమ ముఖాలు ఇతరులకు చూపెట్టడం ఇష్టంలేక తలలు వంచుకొని ఉన్నారు.

మరోపక్క వారికి కొంచెం దూరంలో చింతచెట్టు కింద నీడలో టేబుల్, కుర్చీ వేసుకొని స్టేషన్ రైటర్ ఏదో ఫారాలు పూర్తిచేస్తున్నాడు. అతని చుట్టూ ఆడా మగా పదిమంది దాకా గ్రామస్థులు నిలబడి ఉన్నారు. బహుశా వారు అమ్మాయిల తాలూకు బంధువులై ఉంటారు.

చిత్రాలు: పి.ఎస్. బాబు

శ్రీనివాస్, వెంకటపతి స్కూటర్ స్టాండు చేసి లోపలికి వచ్చారు. ఓ కానిస్టేబుల్ ముందుకు వచ్చి "సార్! యస్.పి. వచ్చినారు. లోపల యస్సయి, సి.ఐ.తో ఏదో కేసు గురించి సీరియస్‌గా డిస్కస్ చేస్తున్నారు. దయచేసి ఒక్క రెండు నిమిషాలు ఆగండి" అని చెప్పి రెండు కుర్చీలు వరండాలో వేసి వారిని కూచుండబెట్టాడు.

లోపల ఆఫీస్ రూంలో పోలీసు ఆఫీసర్లు ముగ్గురూ సీరియస్‌గా కాకుండా బ్రోతల్సును గురించి సాదాగా మాట్లాడుకుంటున్నారు.

"ఈ నలుగురే కాదు సార్! ఒక్క బొంబాయిలోనే రెడ్‌లైట్ ఏరియా ప్రాంతాల్లో ఇలాంటి వారు సుమారు నలభై వేల మంది దాకా ఉన్నారంట.

"దొంగతనాలు, దోపిడీలు ఖూనీలు లాగానే, దేశంలో వ్యభిచారమూ విచ్చలవిడిగా వ్యాపించి పోయింది. దానికి తగ్గట్లు వ్యభిచారిణుల సంఖ్య కూడా పుట్టగొడుగుల్లా పెరిగిపోతూ ఉంది" అన్నాడు బొంబాయి వెళ్ళి వచ్చిన యస్సయి రాజారెడ్డి.

"రాజారెడ్డీ, మనలో మాట" అని ఇన్‌స్పెక్టర్ కొంచెం సీరియస్‌గా ముఖం పెట్టి "ఏ ఆడదీ స్వతహాగా తనకు తానుగా చెడిపోదు. అందుకు ప్రయత్నించదు కూడా. కానీ, చెడిపేస్తున్నారు. భ్రష్టు పట్టిన ప్రతి ఆడదాని వెనుకా పది 'మగచేతులైనా' ఉంటాయని అనుకోవలసివస్తోంది" అని సామాజిక దోషాన్ని వెలిబుచ్చాడు. మళ్ళీ ఆయన యస్.పి. వైపు చూస్తూ- "సార్, ఫుట్‌బాల్ ఆటగాళ్లు పదిమంది బంతిని తన్నుకుంటూ తన్నుకుంటూ వెళ్లి నెట్టులోకి ఎలాగ తోసివేస్తారో, అలాగే కట్నాలు, అత్తమామల ఆరడి, పురుషాధిపత్యం, మత ఛాందసం, కులాచారాలు, దారిద్ర్యం అన్నీ కలిసి స్త్రీని నెట్టుకుంటూ వెళ్లి వ్యభిచార గృహాల్లోకి తోసేస్తున్నాయంటే అతిశయోక్తి కాదు" అని విచారం వ్యక్తం చేశాడు.

ఆ మీదట యస్.పి. గడియారం చూసుకొని పైకి లేస్తూ "సరే బ్రదర్స్. ఈనాడు వ్యభిచారం సమాజానికీ, దేశానికీ సంబంధించిన ఓ క్లిష్ట సమస్య. ప్రజలూ, ప్రభుత్వమూ పరిష్కరించవలసిన జాతీయ సమస్య. వాస్తవాలు ఏమైనా, డిపార్టుమెంట్ ద్వారా మనం ఏమీ చేయలేం. అది మన పరిధిలో లేనిది. చట్టం ప్రకారం నడుచుకోవడమే మన డ్యూటీ. ఇన్స్‌పెక్టర్, ఈ బ్రోతల్ కేసును తగు రీతిలో సౌమ్యంగా పరిష్కరించి, ఫైల్ క్లోస్ చేయండి. నానబెట్టవద్దు. అర్జంటు పనులెన్నో ఉన్నాయి" అని సలహా ఇచ్చి సూపరింటెండెంట్ వెళ్ళిపోయాడు.


ఇన్‌స్పెక్టర్ యస్సయి రాజారెడ్డిని బయట ఉన్న పేరంట్సుని కన్విన్స్ చెయ్యమని పంపించాడు. ఆపైన కానిస్టేబుల్ చెప్పగా వరండాలో ఉన్న వారిని లోనికి పంపించమన్నాడు.

శ్రీనివాస్‌ని, వెంకటపతిని సాదరంగా లోనికి ఆహ్వానించాడు. టీలు తెప్పించాడు, సిగరెట్లు ఆఫర్ చేశాడు.

"ఆఁ చెప్పండి సార్. ఏం విశేషాలు!" అడిగాడు.

"విశేషాలు మీరు చెబితే తెలుసుకుందామని వచ్చాం. ఏదో బ్రోతల్స్ వ్యవహారమంట. ఏమిటి సంగతి?" అడిగారు.

"ఆహా, తప్పక చెబుతాను, వినండి సార్. బంగారుపాళెం బొమ్మసముద్రం ఇలాకాకు చెందిన ఇద్దరు ఆసాములు ఈడుకొచ్చిన తమ ఇద్దరు కూతుళ్ళు కనిపించడంలేదని స్టేషన్‌లో రిపోర్టు ఇచ్చారు. ఆ ఫిర్యాదు మీద మేము యథావిధిగా రంగంలోకి దిగాము - వెదికాము. విచారించాము. ఆ ఎదిగిన ఆడకూతుళ్ళు వ్యభిచార గృహాలకు ఆడపిల్లల్ని చేరవేసే దళారుల చేతుల్లో పడినట్లు చూచాయగా తెలిసింది. ఒక యస్సయి, ఇద్దరు కానిస్టేబుళ్ళు అదేపనిలో నిమగ్నమై అన్వేషణ సాగించారు. నెల్లూరు, గుంటూరు, బెజవాడ లాడ్జీలు మొత్తంగా గాలించారు. బ్రోకర్లను విచారించారు. చివరకు ఒక చిన్న క్లూ



**ఫుట్‌బాల్ ఆటగాళ్లు బంతిని తన్నుకుంటూ వెళ్లినట్లు, స్త్రీని నెట్టుకుంటూ వెళ్లి వ్యభిచార గృహాల్లోకి తోసేస్తున్నారు.**

ఆధారంగా బొంబాయి నగరానికి వెళ్ళారు. అక్కడ రెడ్‌లైట్ ఏరియాలో వడువు వృత్తిలో చిక్కుకొని ఉన్న ఆ ఇద్దరు అమ్మాయిల్నీ ఇంకా మన జిల్లాకు చెందిన మరో ఇద్దరు ఆడపిల్లల్నీ విడిపించుకొని ఇక్కడికి తెచ్చాము. ఇంతవరకూ మా కృషి సాఫీగాను, నవలంగాను జరిగింది.


"ఇప్పుడు వీరిని భద్రంగా వారి వారి బంధువులకు అప్పగించాలి. ఈ నందర్భంలోనే మాకు అనేక చిక్కులు, కొత్త నమస్యలు ఎదురవుతున్నాయి. అక్కడ బొంబాయిలోనేమో ఈ యమ్మణ్ణులు కుయ్యో మొర్రో అంటూ మమ్మల్ని ఈ ఊబిలో నుండి రక్షించండి, మా ఊళ్ళకు చేర్పించండి, పుణ్యం కట్టుకోండి అని మా వాళ్ళ కాళ్ళూ చేతులూ పట్టుకొని ప్రాధేయపడ్డారు. కానీ, తీరా ఇక్కడికి వచ్చిన మీదట వీరి ధోరణిలో వింతగా మార్పు వచ్చింది. ఇప్పుడు ఈ యమ్మణ్ణులు తమ ఇళ్ళకు అమ్మా నాన్నల వద్దకు పొయ్యేందుకు బొత్తిగా ఇష్టపడడంలేదు. మొరాయించి మొండికేస్తున్నారు. సానివాడల్లో ఉండి వచ్చిన నంసార్ల బిడ్డలకు సాటివారిలో నమాదరణ ఉండదనీ, అవమానంతో తలదించుకొని తిరగవలసి వస్తుందనీ, అసలుకు అమ్మా నాన్నల నుండే అభిమానం, అప్యాయతలు లభించవనీ ఇప్పుడు వీరికి దిగులు పట్టుకుంది. తమవారి వెంట వెళ్ళేందుకు వెనకాడుతున్నారు.

"పోతే, మరోపక్క దారి తప్పి చరించిన నంతానాన్ని చేరదీయడానికి తల్లిదండ్రులూ వెనకాడుతున్నారు. వీరిని తీసుకెళ్ళి ఇంటిలో పెట్టుకుంటే మిగిలిన ఆడబిడ్డలకు నంబంధాలు రావనీ, ఎవరూ ముందుకు రారనీ, ఈ బిడ్డల మూలాన నలుగురిలో నామోషీగా తిరగవలసి వస్తుందనీ పెద్దలు భయపడుతున్నారు.

"ఎడముఖం పెడముఖంగా ఉన్న ఈ రెండు పార్టీల నడుమ మేం పోలీసోళ్ళం ఎటూ పాలుపోక నలిగి చస్తున్నాం. ఆడపావల్ని అమ్మా నాన్నలనీ నమాధాన పరచడానికి మా యస్సయి ప్రొద్దుటి నుండి శాయశక్తులా తంటాలుపడుతున్నాడు. ఒక విషయం గమనించండి. ఖూనీలు, దోపిడీలు, దౌర్జన్యం లాంటి కేసులైతే మేం పోలీసు వృత్తి స్ఫూర్తితో ముందుకు దూకి తెంపుగా వనిచెయ్యగలం. కానీ, ఇలాంటి మద్దెస్తాలు చెయ్యడం మా తత్వానికే నరివడని నంగతి. నంఘ నంస్కర్తలో, నమాజ సేవకులో వరిష్కరించవలసిన విషయాలు మా నెత్తిమీద రుద్దడం నమంజనంగా తోచదు" అని కేసు పూర్వాపరాలు వివరించాడు ఇన్‌స్పెక్టర్.

ఇన్‌స్పెక్టర్ నుధాకరరావు నంవత్సరంగా ఈ టౌన్‌లోనే వనిచేస్తున్నాడు. సీనియర్ ఉద్యోగి. ఓర్పు, విజ్ఞత ఉన్న వ్యక్తిగా గుర్తింపు పొందాడు. ఎంత తీవ్ర విషయాన్నయినా నరదాగా మాట్లాడే నేర్పుగల మనిషి. ఆయన ఓ సిగరెట్టు ముట్టించి వత్రికల వాళ్ళతో మళ్ళీ అన్నాడు:

"ఇప్పటికి మూడు దినాలుగా మా స్టేషన్‌లో ఈ నమస్య ముగింపుకు రాకుండా కొనసాగుతూనే ఉంది. ఎంత త్వరగా వీళ్ళను వదిలించుకుంటే అంత క్షేమం మాకు. ఇలాంటి వాళ్ళను స్టేషన్‌లో అట్టిపెట్టుకోవడమంటే నిప్పుల్ని మూటగట్టుకొని ఒళ్ళో ఉంచుకోవడంతో నమానం... అంగడి నరుకంటే అందరి మగాళ్ళకూ అలుసే సార్. మిత్రులు కాబట్టి మీకో నిజం చెప్పనా! అసలుకు మా స్టేషన్ సిబ్బందినే నమ్మలేకుండా ఉన్నాను. మా మునలి కానిస్టేబుల్ ఒకడు ఓ అమ్మాయికి చాటుగా బిరియానీ పొట్లాలు అందించాడంట. ఇంకో ఇద్దరు యంగ్ జవాన్లు అమ్మణ్ణులకు టిఫిన్లు, టీలు నరఫరా చేసి తెగ మురిసిపోతున్నారని నా నోటీసుకు వచ్చింది. అందుకే నా జాగ్రత్తలో నేనున్నాను. ఈ మూడు రోజులుగా ఇంటికి కూడా పోకుండా స్టేషన్ లోనే తిష్ఠవేసి కూచున్నాను. ఏ చిన్న పొరపాటు జరిగినా ఆ మరునిమిషమే మీరు పేపర్లో - పోలీసు స్టేషన్‌లో ఖాకీల కామకలాపాలు - అంటూ బాక్సె కట్టి వేయిస్తారు. అంతెందుకు! పోలీసు స్టేషన్‌లో ఓ చిన్న ఎలక చచ్చినా అది తప్పక 'లాకప్ డెత్తే'



**కుం**దేలు నేరుగా వంటింటిలోకే వచ్చేసినట్లు, ఇప్పుడు రోజూ తమ ఇంటికే వచ్చి పనిచేస్తూ ఉంది అంజలి.

అయ్యుంటుందని గోలపెడుతుంది లోకం" అంటూ ఇన్‌స్పెక్టర్ వాళ్ళవైపు తమాషాగా చూస్తూ పొట్ట కదిలించి వకవకా నవ్వేశాడు

ఇంతలో ముగ్గురు అమ్మణ్ణులు తప్పు చేసిన వారిలా సిగ్గుతో తలలు వంచుకొని ఇన్‌స్పెక్టర్ ముందుకు వచ్చి - వస్తాం సార్, నమస్కారం - అని కోరస్‌గా పలికి ఆయన వద్ద సెలవు తీసుకొని బంధువుల వెంట వెళ్ళిపోయారు.

ఆ ముగ్గురు వెళ్ళిపోవడంతో ఇన్‌స్పెక్టర్‌కు నగం బరువు దించుకున్నట్లనిపించింది. తేలికగా ఊపిరి పీల్చుకొని కర్చీఫుతో ముఖం తుడుచుకున్నాడు. రెండోమారు మళ్ళీ టీలు తెమ్మని ఆజ్ఞాపించాడు. సిగరెట్టు పెట్టె విలేఖర్ల ముందుకు జరుపుతూ అన్నాడు— "మూడు రోజులుగా మల్లగుల్లాలు పడి, మా పోలీసు తెలివంతా ఉపయోగించి ఆడపావల్ని వారి అమ్మా నాన్నలనూ ఒప్పించి ఓ గాటికి తెచ్చి సాగనంపేనరికి మా తల ప్రాణాలు తోకదాకా వచ్చాయంటే నమ్మండి సార్. కానీ, ఇంకా మా పని పూర్తికాలేదు. ఇంకో కేసు మిగిలి ఉంది. ఈమె బలే మొండిఘటంగా కనబడుతూంది. ఈవిడ తన పేరు చెప్పదు. ఊరు చెప్పదు. బంధువులెవరో, ఎక్కడున్నారో నసేమిరా చెప్పనంటూంది. ఏ అచూకీ ఇవ్వదు. అనవాలు చెప్పదు. చిక్కు నమస్యగా తయారై కూచుంది. ఈ మహాతల్లిని ఎవరికి అప్పగించడమా, ఎలా వదిలించుకోవడమా, ఏమి చేయడమా అని మాకు ఆలోచన పట్టుకుంది. అదిగోనండీ ఆ మౌనదేవత! అక్కడ వేపచెట్టు కింద అరుగుమీద ఎలా నిర్వికారంగా కూచొని ఉందో చూడండి." అంటూ ఇన్‌స్పెక్టర్ కుర్చీ మీద కొంచెం వక్కకు తిరిగి చూపెట్టాడు ఆమెను.

వెంకటపతి, శ్రీనివాస్ కొంచెం పైకి లేచి ఆసక్తిగా కిటికీ గుండా అటువైపు చూశారు. అదే నమయంలో ఆమె కూడా మొగమెత్తి వీరిని చూసింది. వెంకటపతి ఆమెను స్పష్టంగా చూశాడు. మళ్లీ చూశాడు. కళ్ళు చికిలించి పరిశీలనగా చూశాడు. చూసి ఉలిక్కిపడ్డాడు. తత్తరపడ్డాడు, నిమేషం నిశ్చేష్టుడయ్యాడు. ఆమె ఎవరో కొత్త మనిషి కాదు. తనకు తెలిసిన అంజలి! కచ్చితంగా అంజలే! అంతే, పిమ్మట ఆ మహానుభావుడు ఒక్క క్షణం అక్కడ ఉండలేకపోయాడు. ఏదో సాకు చెప్పి, సెలవు తీసుకొని స్టేషన్ నుండి జారుకొని బయటపడ్డాడు.

* * *

అయిదేండ్లకు ముందు - వెంకటపతి ఇంటర్ చదివే రోజులు. దశరా సెలవుల్లో స్వగ్రామం వెళ్ళాడు. అప్పటికి వాళ్ళ కుటుంబం పల్లెలోనే ఉండేది.

ఓ రోజు సాయంత్రం "వెంకటా, కళ్ళం బండ మీద శెనిగవామికాడ చెన్నయ్య కావలి ఉండాడు. నువ్వెళ్ళి అయన్ను ఇంటికి పంపించు. నంగటి తిని బేగి వచ్చేస్తాడు. అందాకా నువ్వు అక్కడే ఉండు. లేకుంటే చిల్లర దొంగలు కాయలు దోచుకెళ్ళుతారు" అని చెప్పింది తల్లి.

కళ్ళం బండ రాదారికి వక్కనే ఉంది. బండమీద పెద్ద శెనిగవాము. గొడ్లు, మేకలు, కుక్కలు జొరబడి తింటాయి. కొంచెం ఏమారితే వచ్చే పోయే జనం కాయలు ఒళ్లోకి తోసుకొని పోతారు. కంటికి రెప్పలా కుప్పల్ని కాపాడుకోవాలి. ప్రొద్దు కుంకింది. క్రమక్రమంగా జనాల, జీవాల రాస్తా తగ్గింది. చీకటి బాగా ముదిరింది. వెంకటపతి కుప్పకు కొంచెం దూరంలో రాతిమీద కూచొని, పైన పొడుస్తున్న చుక్కల్ని లెక్కపెడుతున్నాడు.

శెనిగవామి దగ్గర ఏదో అలికిడి అయింది. వెంకటపతి హుషారయ్యాడు. కుక్కలేమో! కాదు. ఏదో మనిషి

అకారం తచ్చాడుతూంది. ఆ శాల్తీ తిన్నగా కుప్ప మీదికి వంగి చెప్పేదంటు కప్పు తొలగిస్తున్న చప్పుడు. దొంగే అయ్యుంటాడు. జాగ్రత్తగా పట్టెయ్యాలనుకున్నాడు వెంకటపతి. చప్పుడు కాకుండా లేచాడు. కుప్పను సమీపించాడు. ఆ శాల్తీ కుప్పలో నుండి కాయలు తోడుతూ ఉంది. వెంకటపతి మెల్లగా వెనుకతట్టుగా వెళ్ళి రెండు చేతులతో గబుక్కున అదుముకున్నాడు.

ఆ సందర్భంలో జడ వెంట్రుకలు మొగానికి గుచ్చుకొని పూలవాసన గుప్పున ముక్కుకు సోకింది. శరీరం మెత్తగా ఉంది. మగ మనిషి కాదు. వెంకటపతికి ఒళ్ళు జలదరించింది.

తన పట్టుతో కిమ్మనకుండా గువ్వలా వణకుతున్న ఆమెను "ఎవరు నువ్వు?" అని పలకరించాడు.

"నేను... నేను... అంజల్ని. మీ ఇంటిలో పనిచేసే మంగమ్మ కూతుర్ని."

"మరి ఈ దొంగపని ఏమిటి? శెనిక్కాయలు అడిగి తీసుకోవచ్చుగదా!"

"శెనిక్కాయలు దొంగిలించలేద్మ చినబాబూ. చెన్నయ్యకు తెలీకుండా కుప్పలో సీతాఫలం కాయలు మాగేశాను. అవి తీసుకపోదామని వచ్చాను" అంటూ కింద ఉన్న సీతాఫలాలు చూపించింది.

తన బాహుబంధంలో ఓ ఆడపిల్ల! అతనిలో ఓ మధురస్పందన. మేను పులకించింది. ఆ పిల్ల మెడమీద మత్తుగా, మెత్తగా ఓ ముద్దు పెట్టి చేతులు సడలించాడు. చప్పున గంతేసి సర్రున ముందుకు దూకి చీకట్లో కలిసిపోయింది. వెంకటపతి వెర్రి వాడిలా నిలబడిపోయాడు.

సెలవులు అయిపోవడంతో ఆ మరుదినమే వెంకటపతి చిత్తూరుకు వచ్చేశాడు.

* * *

అంజలి బొమ్మ అతని గుండెమీద హత్తుకుపోయింది. యౌవనోదయంలో తొలి కౌగిలి! ఆ గిలిగింతలు! ఆ స్పర్శ మాధుర్యం! మనసుకు వచ్చినప్పుడల్లా వెంకటపతి విలవిల్లాడేవాడు. మళ్ళీ ఒకమారు పల్లెకు పోవాలనీ, అంజలిని చూడాలనీ పదే పదే అనుకున్నాడు. అయినా, కుదరలేదు. చదువులు, పరీక్షలు, విద్యార్థి ఉద్యమాల్లో నిమగ్నమై పోయినందువల్ల వీలుపడలేదు. ఈలోగా తమ కుటుంబం పల్లె వదలి పెట్టి పట్నానికే వచ్చేసింది.

తండ్రి రాఘవయ్యకు వారసత్వంగా వచ్చిన మునసబుగిరి ఊడిపోయినందువల్ల, వర్షాలు లేక వ్యవసాయం సాగనందువల్ల, పట్నంలో అడపాదడపా చేస్తున్న కాంట్రాక్టు పనులు పుంజుకున్నందువల్ల సంసారాన్ని పల్లెనుండి పట్నానికే తరలించేశాడు రాఘవయ్య.

అక్కడ పల్లెలో ఇంతకాలం రాఘవయ్య గారి ఇంటి పనులు, పొలం పనులు చేసుకుంటూ నిశ్చింతగా బతుకు సాగిస్తున్న మంగమ్మకు రాఘవయ్య గారి కుటుంబం వెళ్ళిపోవడంతో కష్టాలొచ్చాయి. జరుగుబాటు దుర్లభమైంది. కొన్నాళ్ళ పిమ్మట ఆమె కూడా బిడ్డతో చిత్తూరుకు వచ్చేసింది. మిట్టూరులో ఓ గుడిసె వేసుకొని, రాఘవయ్యగారింటిలో ఉదయం, సాయంకాలాల్లో పాచి పనులు చేస్తూ మిగిలిన వేళల్లో కూలిపనులకు వెళ్ళేది.

వెంకటపతి పంట పండింది. కుందేలు నేరుగా వంటింటిలోకే వచ్చేసినట్లు అంజలి ఇప్పుడు రోజూ తమ ఇంటికే వచ్చి పనిచేస్తూ ఉంది. అంజలి రాకతో వరదొచ్చినట్లు వెంకటపతిలో మోహం పెల్లుబికింది. పిల్లను మచ్చిక చేసుకోవడం మొదలెట్టాడు.


పోతుమేకలా వెన్నుదన్ని వెంటపడ్డాడు. కోరికలు ఊరించాడు. అమ్మా నాన్నలను ఎదిరిస్తానన్నాడు. గుళ్ళో పెళ్ళి చేసుకుంటానన్నాడు. అరచేతిలో స్వర్గం చూపెట్టాడు. తమ దయమీద ఆధారపడింది, తమ ఇంటి పనిపిల్ల. ఎదురేం చెప్పగలదు? కన్నెపిల్ల కడకు కరిగిపోయింది. లొంగిపోయింది. చేరువ అయింది.

తదాదిగా వారిమధ్య చాటుమాటుగా ప్రణయ వ్యాపారం పసందుగా సాగిపోయింది. అంజలికి నెల తప్పింది. తెలిసి తల్లి గుండె తల్లడిల్లింది. మంగమ్మ రాఘవయ్య వద్దకు పరుగు పెట్టింది. గుండెలు బాదుకుంటూ సంగతి చెప్పింది. రాఘవయ్య వ్యవహార కుశలుడు. తక్షణమే గొప్పోళ్ళ తరహాలో చకచక పనులు చక్కబెట్టేశాడు.

మంగమ్మ నోరు మూయించాడు. అంజలిని ఒక ఎలక్ట్రీషియన్ కుర్రాడికి కట్టబెట్టించాడు. చెల్లెలి కూతురుతో కొడుకు పెండ్లి జరిపించాడు. వెంకటపతిని కాంట్రాక్టు పనుల్లో నిమగ్నం చేశాడు.

పెండ్లి పిమ్మట వెంకటపతి బుద్ధిమంతుడయ్యాడు. పెద్ద తరహా అలవరచుకున్నాడు. జీవన వ్యాపారంలో లావాదేవీలు, లాభనష్టాలు త్వరలో తెలుసుకున్నాడు. తను సమాజంలో పైకి రావడానికి ముందుచూపుతో చక్కగా పథకాలు వేసుకున్నాడు.

స్థానికంగా ఒక వారపత్రికను ప్రారంభించాడు. జిల్లా అధికారుల్లో పలుకుబడి పెంచుకున్నాడు. గవర్నమెంటు కాంట్రాక్టులు కొల్లలుగా సాధించాడు. తన వార్డు నుండి కౌన్సిలర్‌గా ఎన్నికయ్యాడు. ఆ పైన మునిసిపల్ ఛైర్మన్, ఆ మీదట యం.యల్.ఎ. ఇవీ అతను పెట్టుకున్న లక్ష్యాలు.



రెండేండ్లు గడిచాయి.

ఇక్కడ వెంకటపతికి అన్నీ జయాలుగా ఉంటే, అక్కడ అంజలికి అన్నీ అపశ్రుతులే - చావు దెబ్బలే.

నాలుగు నెలలకే తన కడుపు పోయింది. కామెర్ల రోగంతో అమ్మ కాలమైపోయింది. కష్టాలు ఒక్కటిగా రావు. కట్టుకున్నవాడు కరెంటు షాక్‌తో చచ్చిపోయాడు. కూడూ, గుడ్డా, నీడా లేని అనాథ అయింది. పరుల పంచన చేరింది.

ఒకరోజు మార్కెట్ వీధిలో స్కూటరుమీద పోతున్న వెంకటపతికి అంజలి ఎదురుపడింది. "చినబాబూ" అంటూ చేయెత్తి పిలిచింది. తటపటాయిస్తూ ఆగాడు. నీడను వెదుక్కుంటున్న బాటసారిలా తోచింది అప్పుడామె ఆకృతి. దగ్గరగా వచ్చి "మీతో మాట్లాడాలని ఉంది" అని చెప్పింది.

"అర్జెంటు పనిమీద పోతున్నా ఇప్పుడు కుదరదు" అని చెప్పి, అలా ఒక అర నిమిషం ఆలోచించి- "మధ్యాహ్నం ఇంటికి రా. తీరిగ్గా ఉంటాను" అంటూ వెళ్ళిపోయాడు.

అంజలి మధ్యాహ్నం ఆయన ఇంటికి వెళ్ళింది. జంకుతూ లోపలికి అడుగుపెట్టింది.

వెంకటపతి చొక్కా విప్పేసి, లుంగీ కట్టుకొని హాల్లో పంఖా కింద కూచొని ఉన్నాడు. ఇంటిలో మరో మనిషి లేనట్లుగా ఉంది.

"అమ్మా నాన్నా పుష్కరాలకు వెళ్ళారు. సుశీల కాన్పుకు అమ్మగారింటికి వెళ్ళింది. ఏమిటి సంగతి, మాట్లాడాలన్నావ్" అన్నాడు.

"మున్సిపాల్టీలో ఒక స్వీపరు పోస్టు ఖాళీగా ఉందట. మీరు కౌన్సిలర్ గదా! ఆ పని నాకు ఇప్పించండి. బతుక్కుంటాను. మీకు పుణ్యముంటుంది" అని తన బాధను చెప్పుకున్నది.

"ఓస్! అదెంత పని! మన చేతుల్లోనే ఉంది. తప్పకుండా నీకు ఆ ఉద్యోగం ఇప్పిస్తాను" నమ్మకంగా చెప్పాడు.

**"నువ్వు జ్ఞాపకం రాని క్షణమంటూ ఉండదు" అంటూ వెళ్ళి వీధి తలుపు వేసి గడిపెట్టాడు వెంకటపతి.**

అంజలి ముఖంలో ఆశాజ్యోతి వెలిగింది. కృతజ్ఞతా భావం పెల్లుబికింది.

"అంజలీ" అని కుర్చీలో నుండి లేస్తూ— "నన్ను అపార్థం చేసుకోకు. ఆనాడు పెద్దల్ని ఎదిరించలేకపోయాను. నీమీద నాకు ఎనలేని ప్రేమ. నువ్వు జ్ఞాపకం రాని క్షణమంటూ ఉండదు" అంటూ వెళ్ళి వీధి తలుపు వేసి గడిపెట్టాడు.

అతని కక్కుర్తి ఆమెకు అవగతమైంది. అడుగు మాడుతున్న ఆమె బతుకులో - బతుకునాడుల్లో తత్తరపాటు లేదు. తిరుగుబాటూ లేదు. సమ్మతీ లేదు. అసమ్మతీ లేదు. జీవచ్ఛవంలా చూస్తూ ఉండిపోయింది.

ఆపైన అంజలి అభ్యర్థన అతను మన్నించాడా? లేదు! ఆరు వేలు లంచం గుంజుకొని ఆ ఉద్యోగం మరెవరికో ఇప్పించాడు.

అంజలికి మున్సిపాలిటీలో స్థానం కల్పిస్తే తనకు దగ్గరవుతుంది. రానుక పూనుక తిరుగుతుంది. ఈ రహస్యాచారం బయటకు పొక్కుతుంది. తన పేరు దిగజారిపోతుంది. ఆమెను దూరంగా ఉంచడమే శ్రేయస్కరమనుకున్నాడు.


* * *

సుమారు తొమ్మిది నెలల పిమ్మట...

తన బిల్డింగ్ కాంట్రాక్టు పనుల యూనిట్‌లో పని చేస్తున్న ఒక మేస్త్రీ జబ్బువడితే పరామర్శించేందుకు వెంకటపతి అతని ఇంటికి వెళ్ళాడు.

అక్కడ అంజలి అతనికి సేవలు చేస్తూండగా చూసి నివ్వెరపోతూ తడబడ్డాడు. అదరాబాదరా మేస్త్రీ క్షేమ సమాచారాలు విచారించి, అతనికి కొంత పైకమిచ్చి బయట పడ్డాడు.

అంజలి వెంకటపతిని అనుసరించి కొంత దూరం వచ్చింది.



**వెంకటపతి అంజలి గురించి పరితపించలేదు. ఒకందుకు సంతోషించాడు, ఈ పీడ నీడ శాశ్వతంగా తన్నొదిలిపోయిందని.**

"ఏం వెంటవడ్డావ్?" విసుక్కుంటూ ప్రశ్నించాడు.

"దిక్కూ మొక్కూ లేక కొట్టుమిట్టాడుతున్న గడ్డు కాలంలో మేస్త్రీ ఇంత చేటిచ్చి నన్ను చేరదీశాడు. ఉండిపోయాను. కొంతకాలం బాగానే చూసుకున్నాడు. కానీ, ఇప్పుడు పూర్తిగా మారిపోయాడు. ఇల్లు కదలడు. పనికి పోడు. పైసా సంపాదన లేదు. పైగా తాగుడు ఎక్కువైంది. నేను తెచ్చే కూలిడబ్బులు ఆయన తాగుడుకే చాలడం లేదు. ఇంకా సంపాదించుకు రమ్మంటాడు. ఎక్కడనుండి తెచ్చివ్వను! ఏం ఒళ్ళు బాగుందే! ఎవడి దగ్గరైనా పడుకొని తెమ్మంటాడు. ముదనష్టపు మొగోడు. ఈ తాగుబోతుతో ఇంక నేను ఉండలేను. నాకేదైనా దారి చూపించు. లేదా మీ ఇంటి పంచకే వచ్చి చేరతాను!" ఆత్మీయుడుగా బావించి దీనంగా చెప్పుకున్నది.

ఆమె చెప్పిన ఆఖరి మాటకు వెంకటపతి అదిరి పడ్డాడు.

"అంజలీ! మోసకారి మనుషులను నమ్మి నువ్వు ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొన్నావు. ఇకమీదటైనా నువ్వు అలాంటి గోతుల్లో పడకూడదు. కాబట్టి నిన్ను తిరుపతి దేవస్థానంవారి అనాథ ఆశ్రమంలో చేర్పిస్తాను. ఒకరి ప్రమేయం లేకుండా నిశ్చింతగా నీ బతుకు సాగిపోతుంది. రేపే తిరుపతికి పోదాం, రెడీగా ఉండు" అని చెప్పి వెళ్ళాడు.

మాట ప్రకారం మరుదినం వెంకటపతి అంజలిని. వెంటబెట్టుకొని తిరుపతికి బయల్దేరాడు.

బస్సులో ఇద్దరూ పక్కపక్కన కూర్చున్నారు. ఇన్ని బాధల్లో కూడా అంజలి అందం ఏమాత్రం తగ్గలేదు. నిప్పులో పడిన బంగారు కడ్డీలా మెరుస్తూనే ఉంది.

పురుషుని నిఘంటువులో 'ఆడది' అన్న పదానికి అర్థం అనుభవించదగిన అందమైన దేహం - అట. ఆ స్ఫూర్తితో వెంకటపతిలో అప్పుడు మరో ఆలోచన మొలకెత్తింది.

అనాథాశ్రమంలో అనేక కట్టుదిట్టాలుంటాయి. క్రమశిక్షణ ఉంటుంది. తరచు తాను వెళ్ళి అంజలిని కలుసుకునేందుకు వీలుండదు. కనుక, పథకం మార్చాలనుకున్నాడు. తిరుపతిలో తన స్నేహితుడు ఒకడు హొటల్‌తో కూడిన లాడ్జి నడుపుతున్నాడు. బస్సు దిగుతూనే అంజలిని తీసుకొని నేరుగా ఆ లాడ్జికి వెళ్ళాడు. ఓనరు మిత్రునికి నచ్చచెప్పి, అంజలిని అక్కడ పనిమనిషిగా చేర్పించి వచ్చేశాడు.

కాంట్రాక్టు పనులు, మునిసిపల్ వ్యవహారాల్లో మునిగి తేలుతున్న వెంకటపతికి నెల పిమ్మట ఒకరోజు తీరిక చిక్కింది. అంజలి మీద మనసు పోయింది. ఛలో తిరుపతి అని బస్సెక్కేశాడు.

లాడ్జి ఓనర్ని కలిసి - "అంజలి ఎట్లుంది? చూసిపోదామని వచ్చాను. పిలిపించు" అన్నాడు.

"ఒరే వెంకటా! ఇంకా ఎక్కడుందిరా అంజలి! ఎప్పుడో ఎగిరిపోయింది. ఇలాంటివారిని చేర్చుకుంటే ఎన్నో సమస్యలు ఎదురౌతాయనీ, మా బిజినెస్సే దెబ్బ తింటుందనీ ముందే నీకు చెప్పాను కదా! పోతే పోయింది. కూడా మా వంటవాణ్ణి లేపుకెళ్ళింది. సరకులు వేసే ఓ ఎక్స్‌పర్టును పోగొట్టుకున్నానని చింతిస్తున్నా" అని వాపోయాడు ఓనరు మిత్రుడు. వెంకటపతి హతాశుడై తిరుగు ప్రయాణం కట్టాడు.

కొన్నాళ్ళకు బదలీ మీద బొంబాయి వెళుతున్న ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసరుకు వీడ్కోలు చెప్పేందుకు వెంకటపతి రేణిగుంట రైల్వేస్టేషన్‌కు వెళ్ళాడు.

బొంబాయి మెయిల్ నిలబడి ఉంది. ప్లాట్‌ఫారమ్ మీద నిలబడి పెట్టెలో ఉన్న ఆఫీసర్‌తో మాట్లాడుతున్నాడు. అల్లంత దూరంలో ఓ రైలుపెట్టెలోకి ఎక్కుతూ అంజలి వెంకటపతి దృష్టిలో పడింది. ఆమెతో ఇద్దరు ఆడవాళ్ళు, ఒక మగవాడు ఉండడం గమనించాడు. బండి కదలింది. వెంకటపతి ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాడు.

* * *

మూడేళ్ళకు ముందు రేణిగుంటలో రైలెక్కుతూ కనబడిన అంజలి ఈనాడు చిత్తూరు వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో ప్రత్యక్షమైంది.

అంజలి ఆకారంలో పెద్ద మార్పేమీ లేదు. కాకుంటే ఇంకొంచెం ఒళ్ళు చేసి మరింత మెరుగెక్కింది. ముఖంలో అదే కళ.

అంజలి ఆలోచనలతో ఆ రోజంతా అన్యమనస్కంగా గడిపాడు వెంకటపతి. మరుదినం అంజలి ఏమయ్యుంటుందీ! అన్న కుతూహలం అణచుకోలేక మధ్యాహ్నం పోలీసు స్టేషన్‌కు వెళ్ళాడు. ఇన్‌స్పెక్టర్‌ని కలిసి "ఆ నాలుగో అమ్మాయిని ఏం చేశారు!" అని అడిగాడు.

"ఏ నాలుగో అమ్మాయి? అంజలిని గురించేనా?"

వెంకటపతి ఉలిక్కిపడ్డాడు, ఆమె పేరు అతనికి ఎట్లా తెలిసిందా అని.

"వెంకటపతిగారూ?" ఇన్‌స్పెక్టర్ అర్థవంతంగా ఆయన ముఖంలోకి చూస్తూ "అంజలి తన పేరు చెప్పింది. తన వృత్తాంతమంతా చెప్పింది...

తనవారు, తనకు తెలిసినవారు, తను నమ్మినవారు తనకు చేయూత ఇవ్వరా, చేరదియ్యరా అన్న ఆశాలేశం ఆ దీనురాల్లో మినుకు మినుకుగా దాగి ఉండింది. అది ఒట్టి భ్రమగా తేలిపోయింది... మొన్న మీరు శ్రీనివాస్‌తో కలిసి స్టేషన్‌కు వచ్చినారు. అంజలి మిమ్మల్ని చూసింది. మీరు ఆమెను చూసినారు. ముఖం తప్పించి ముభావంగా వెళ్ళిపోయారు. ఆమెతో ఆడుకున్నవారికి ఆపత్కాలంలో ఆమెను ఆదుకోవాలన్న తలంపు, విజ్ఞత లేకపోయింది. దిక్కు లేని స్త్రీ ఏం చేస్తుంది! వెళ్ళిపోయింది."

"ఎక్కడికి వెళ్ళింది!"

"ఎక్కడనుంచి వచ్చిందో బహుశా అక్కడికే వెళ్ళింది. ఆమె దొంగకాదు. దోపరికాదు. మోసకత్తె కాదు. ఆమె ఇచ్చవచ్చిన చోటికి వెళ్ళవచ్చు. ఆ స్వేచ్ఛా, ఆ హక్కూ ఆమెకున్నాయి" అని ముగించి ఇన్‌స్పెక్టర్ చేతికర్ర తీసుకొని తన కోసం కాచుకొని ఉన్న జీపు ఎక్కి వెళ్ళిపోయాడు.

వెంకటపతి అంజలిని గురించి పరితపించలేదు. పశ్చాత్తాపపడలేదు. ఒకందుకు సంతోషించాడు, ఈ పీడ నీడ శాశ్వతంగా తన్నొదిలిపోయిందని. ■